మ్యాన్‌హోళ్లపై మూతల ఏర్పాటు


మ్యాన్‌హోల్‌పై ఏర్పాటు చేసిన మూత

సాక్షి ఎఫెక్ట్..

మియాపూర్: ప్రధాన రహదారుల్లో ధ్వంసమైన మ్యాన్‌హోళ్లకు ఎట్టకేలకు అధికారులు మూతలు ఏర్పాటు చేయించారు. మియాపూర్ ఎంఏనగర్, ప్రశాంత్‌నగర్ రోడ్డులో 'ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో సోమవారం కథనం ప్రచురితం కాగా, అధికారులు స్పందించి మ్యాన్‌హోళ్లపై మూతలు బిగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అధ్యక్షుడిగా ఎన్నిక

గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మోడల నర్సింహా సాగర్ ఎన్నికయ్యారు. తన సమీప ప్రత్యర్థి ఇనయతుల్లాఖాన్‌పై 196 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అలాగే జనరల్ సెక్రెటరీగా ప్రవీణ్ గుప్తా, ట్రెజరర్‌గా ఆత్మారావు ఎన్నికయ్యారు.

ప్రజావాణిలో 12 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్ వి.ప్రశాంతి, అధికారులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో డిప్యూటీ కమిషనర్ వి.ప్రశాంతి అధ్యక్షతన సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా 12 ఫిర్యాదులు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 6, ఇంజినీరింగ్‌కు 2, శానిటేషన్‌కు 3, రెవెన్యూ విభాగానికి ఒక దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీలు ప్రేమ్ కుమార్, ఏసీపీ వెంకటరమణ, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్రదానం


నాగమణి (ఫైల్)

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని రాజేందర్‌రెడ్డి కాలనీ అధ్యక్షుడు కుంట రఘుపతి రెడ్డి తల్లి రాజమణి సోమవారం మృతి చెందింది. ఆమె అవయవాలు దానం చేయాలన్నా ఆమె కోరిక మేరకు నేత్రదాన సంచాలకర్త అల్లం పాండు రంగారావు, పులిపాటి సుధాకర్‌ను సంప్రదించి నగరంలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి నేత్రాలను దానం చేశారు. ఈ సందర్భంగా వారు రఘుపతి రెడ్డి కుటుంబ సభ్యులు అభినందిస్తూ ఇద్దరి అంధులకు చూపు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

యువతి అదృశ్యం

గచ్చిబౌలి: యువతి అదృశ్యమైన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన యువతి (19) ఖాజాగూడలో ఉంటున్న సోదరి ఇంటికి 10 రోజుల క్రితం వచ్చింది. ఈనెల 26న మధ్యాహ్నం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో తెలిసిన చోట్ల వెతికినా ఫలితం లేకుండా పోయింది. అటు స్వగ్రామానికి చేరుకోలేదని తెలియడంతో సోమవారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 19 మంది అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 7మందికి రూ. 1500 చొప్పున, ఇద్దరికి రూ.1000 చొప్పున, మరో ఐదుగురికి రూ .2 వేల, నలుగురికి రూ. 500 జరిమానా విధించారు. అలాగే, మరో వ్యక్తికి జరిమానాతో పాటు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

రసాయన వ్యర్థాలు అరికట్టాలి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామికవాడలోని ఆక్రస్ పరిశ్రమ యజమాన్యం విచ్చలవిడిగా రసాయన గణ వ్యర్థాలను విజయ శ్రీ పరిశ్రమ సమీపంలో పారబోస్తుంది. స్థానిక నాయకుడు వెంకటయ్య సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పరిశ్రమ వ్యవహరిస్తున్న తీరుపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

పార్కుపై పట్టింపేది..?

అధ్వానంగా వినాయక ఉద్యానవనం


ధ్వంసమైన వినాయక పార్కు ప్రధాన గేట్.. నిలిపిన వాహనాలు

- గేటు ధ్వంసం చేసి అక్రమంగా పార్కింగ్
- పార్కు అభివృద్ధికి రూ. 8 లక్షల నిధుల కేటాయింపు
- అయినా ముందుకు సాగని పనులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

చందానగర్: మాదాపూర్ డివిజన్ పరిధి వెంకటరమణ కాలనీలోని వినాయక పార్కు అధ్వానంగా మారింది. కాలనీవాసులకు ఆహ్లాదకర వాతావరణం అందించాల్సిన ఉద్యానవనం నిర్వహణ లేక కొందరు పార్కు గేట్ ధ్వంసం చేసి ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. 'సాక్షి' దినపత్రికలో పలుమార్లు పార్కును అభివృద్ధి చేయాలని కథనాలు ప్రచురితమైనప్పుడు హుటాహుటిన అధికారులు వచ్చి పార్కును పరిశీలించి వెళ్తున్నారు తప్ప అభివృద్ధికి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పార్కులో కనీస సౌకర్యాలు లేకపోవడమే కాకుండా పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో కంపు కొడుతోంది. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి వినాయక పార్కును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


పార్కు ప్రహరీ ధ్వంసమైన దృశ్యం

ముందుకు సాగని పనులు..

- పార్కులో అభివృద్ధి కోసం రూ.8 లక్షల మంజూరు కాగా, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ 2023లో పనులకు శంకుస్థాపన చేశారు.
- అధికారులు ఇప్పటివరకు ఎలాంటి పనులు ప్రారంభించలేదు.

- పార్కు ప్రహరీ, ప్రధాన గేట్ ద్వారం పూర్తిగా ధ్వంసం చేశారు.
- పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించాలి
- చిన్నారులు ఆడుకునేందుకు మరిన్ని ఆట వస్తువులు ఏర్పాటు చేయాలి
- వృద్ధులు సేద తీరేందుకు పచ్చదనంతో కూడిన పార్కును నిర్మించాలి
- కాలనీవాసుల కోసం ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలి
- తాగునీటి కోసం ట్యాంకును నిర్మించాలి
- పార్కులో వాహనాలు నిలపకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

పార్కును అభివృద్ధి చేయాలి..



పార్కు అభివృద్ధి కోసం రూ.8 లక్షల నిధులు కేటాయించారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ముఖ్యంగా ప్రహరీ నిర్మించి ప్రధాన గేట్‌ను ఏర్పాటు చేయాలి. పార్కులో సేద తీరేందుకు సౌకర్యాలు కల్పిస్తే స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
– కుమార్, వెంకటరమణ కాలనీ

వాహనాలు నిలపకుండా చూడాలి



పార్కులో అన్ని వసతులు కల్పించి ప్రజలు సేదతీరేలా అభివృద్ధి చేయాలి. అలాగే వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాలి. చిన్నారులు ఆడుకునేందుకు క్రీడా సామాగ్రి, గార్డెన్ ఏర్పాటు చేయాలి.
– సత్యనారాయణ, వెంకటరమణ కాలనీ

ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం


సభ్యులను సన్మానిస్తున్న జగదీశ్వర్ గౌడ్ తదితరులు

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని సోమేశ్వర్ ఆలయ నూతన కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఆలయ చైర్మన్‌గా పురం విజేందర్‌రెడ్డి, డైరెక్టర్స్‌గా శోభ, పి.లక్ష్మీనారాయణ, ఎం.శ్రీనివాస్, డి.దయానంద, పి.రమేశ్‌యాదవ్, టి.శివకుమార్ గౌడ్, ప్రధాన అర్చకులుగా సంగమేశ్వర్ ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ హాజరై నూతన కమిటీ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని, నీటి సదుపాయం, ఇతర పనులపై శ్రద్ధ పెట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. నాయకు లు దశరథ్, దయాకర్ యాదవ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, యాదగిరి, మల్లేశ్, కుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, నర్సింహారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

పటాన్‌చెరు టౌన్: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి, చిట్కుల్, ఇస్నాపూర్ గ్రామాల్లోని ప్రజలకు తాగునీరు అందించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మిషన్ భగీరథ ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఆయా గ్రామాల పరిధిలో పైప్‌లైన్లు పగిలిపోవడంతో మంచినీటి సరఫరా విషయంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. తాత్కాలిక ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి సరఫరాను ప్రారంభించాలని ఆదేశించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలనీల్లో నూతన ట్యాంకుల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రామేశ్వరంబండ గ్రామ పరిధిలోని వీకర్ సెక్షన్, ఇంద్రపురి కాలనీల్లో జనాభాకు అనుగుణంగా మంచినీరు రావడంలేదని.. వెంటనే సరఫరాను పెంచాలని ఆదేశించారు. దీంతో పాటు ఇంద్రేశం సత్యసాయి వాటర్ పంప్‌హౌస్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి హోప్ ఆఫ్ హంగర్ సంస్థ చేయూత


చెక్కు అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్, పీజేఆర్ నగర్ కాలనీ బ్లాక్ నెంబర్ 92లో నివాసం ఉంటూ చిరుద్యోగం చేసుకుంటున్న కరుణాకర్ కుమార్తె ఉషారాణికి మల్లారెడ్డి కళాశాలలో ఎంబీఏ సీటు వచ్చింది. తల్లిదండ్రులు కాలేజీ బస్సు ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అయన హోప్ ఆఫ్ హంగర్ సంస్థ వారికి సమస్యను వివరించి తగిన సాయం చేయాలని కోరారు. ఆ సంస్థ విద్యార్థిని కాలేజీ బస్సు ఫీజు నిమిత్తం రూ.40 వేలను పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, వాలి నాగేశ్వరరావు, మోజెస్, తిరుపతి, హోప్ ఆఫ్ హంగర్ సంస్థ సభ్యులు వెంకటేశ్వరరావు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకుడి చెరువు సుందరీకరణ పనుల పరిశీలన

మియాపూర్: డివిజన్ పరిధిలోని పటేల్ చెరువు, నాయినమ్మ చెరువు, మక్తమహబూబ్‌పేటలోని పెద్దకుడి చెరువు సుందరీకరణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మల్లిగావాడ్ ఫౌండేషన్ సభ్యులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల్లోని మురుగునీరు, గుర్రపు డెక్కను తొలగించి మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించి ఆహ్లాదవాతావరణం అందిస్తామన్నారు. అదేవిధంగా చెరువు చుట్టూ కంచెలు ఏర్పాటు చేసి స్థలాలు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట మల్లిగావాడ్ ఫౌండేషన్ సభ్యులు రామ్, చైతన్య, నాయకులు సుప్రజ, భార్గవ్, కిశోర్, రవి, నాగిరెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు ఘన నివాళి


కొవ్వొత్తులతో ర్యాలీ తీస్తున్న నాయకులు, కార్యకర్తలు

శేరిలింగంపల్లి: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ హిందూ జాగృతి ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. శేరిలింగంపల్లి గోపీనగర్ హనుమాన్ ఆలయం నుంచి ఖైల్ చౌరస్తా వరకు ర్యాలీ తీసి మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ్ పరివార్ కార్యకర్తలు, వివిధ పార్టీల నేతలు, పతంజలి యోగా సమితి సభ్యులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు పునర్వైభవం తీసుకువస్తాం


కాయిదమ్మకుంట చెరువు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చెరువులను పునరుద్ధరించి పునర్వైభవం తీసుకువస్తామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. నెక్సస్ సెలెక్ట్ మాల్స్ సంస్థ వారు సీఎస్ఆర్ ఫండ్స్‌తో మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువు సుందరీకరణ, పునరుద్ధరణ పనులను అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెరువులో మురుగు నీరు కలవకుండా ఇరిగేషన్ అధికారులు గతంలో యూజీడీ పైప్‌లైన్ చేపట్టారన్నారు. చెరువు కట్ట చుట్టూ మొక్కుంటు పెంచి ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తామన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులో తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ ఐటీ సంస్థ ప్రతినిధులు చైతన్య, రాము, స్థానిక కాంగ్రెస్ నాయకులు గౌతమ్ గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేశ్ గౌడ్, మల్లేశ్ గౌడ్, ప్రవీణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష


ప్రజావాణిలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ తదితరులు

చందానగర్: హఫీజ్‌పేట్‌లోని జలమండలి కార్యాలయంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు జగదీశ్వర్ గౌడ్ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మంజీరా, అండర్ గ్రౌండ్ పైప్ లైన్ పనులపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గచ్చిబౌలి, కొండాపూర్, శేరిలింగంపల్లి, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలో మంజీరా పైప్‌లైన్ పనులపై జనరల్ మేనేజర్, డీజీఎం ఇతర అధికారులతో చర్చించమన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఇబ్బందులుల్లేకుండా చూడాలన్నారు. అలాగే బస్తీల్లో కొంత భాగం డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్యను కూడా పరిష్కరించాలన్నారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ

గచ్చిబౌలి: సీఐటీయూ మేడే పోస్టర్‌ను గచ్చిబౌలి కూడలిలోని ఆటోస్టాండ్ వద్ద నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి సీఐటీయూ కార్యదర్శి కొంగరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ మాట్లాడుతూ.. కార్మికులకు 8 గంటల పనిదినం ఉండాలని చికాగో నగరంలో 1889 మే 1 న జరిగిన కార్మిక వర్గ పోరాటంలో ఎంతోమంది ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. వారి ప్రాణత్యాగాలను స్మరిస్తూ మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాలు సాంబవీరేష్, సంతోష్ ఆటో కార్మికులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రూ.12 కోట్లతో ఇండోర్ సబ్‌స్టేషన్

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పనులకు శంకుస్థాపన

పటాన్‌చెరు: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్న లక్ష్యంతో పటాన్‌చెరు పట్టణంలో రూ.12 కోట్ల అంచనా వ్యయంతో 33/11 కేవీ ఇండోర్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని బ్లాక్ ఆఫీసు ప్రాంగణంలో సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే మొదటిసారిగా పటాన్‌చెరులో ఇండోర్ సబ్ స్టేషన్ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. పాశమైలారం నుంచి నేరుగా నూతన సబ్‌స్టేషన్‌కు ప్రత్యేక లైను వేయడంతో పాటు పటాన్‌చెరు, రామచంద్రాపురం పట్టణాలకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఐలాపూర్‌లో రూ.100 కోట్ల అంచనా వ్యయంతో 132 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, విద్యుత్ శాఖ ఏడీఈలు సంజీవ్, నాగరాజు, రవికాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, నివర్తిదేవ్, అంతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఇండోర్ సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఆలయ భూములను కాపాడండి

పటాన్ చెరు: అమీన్‌పూర్ పట్టణంలోని భ్రమరాంబిక దేవాలయ భూములు కబ్జాకు గురవుతున్నాయని బీరంగూడ పాత గ్రామపెద్దలు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ వైస్ చైర్మన్ నరసింహగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను పథకం ప్రకారం కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 993లో ఉన్న ప్రభుత్వ భూమిని పట్టాభూముల దస్తావేజులు చూపుతో కబ్జా చేస్తున్నారని మండిపడ్డారు. దేవాదాయ, ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. బీరంగూడ గ్రామం పెద్దలంతా సోమవారం ఆలయం ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా అంతా కలిసి పోరాటం చేయాలని నిర్ణయించామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆదెల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


భూములు లాక్కుంటే మేమెట్లా బతకాలి..?

- గుమ్మడిదలలో ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం
- భూసేకరణ వేగవంతం చేసిన అధికారులు
- భూమికి భూమి ఇవ్వాలి.. లేదా ప్రత్యామ్నాయం చూపాలి
- బాధిత రైతుల డిమాండ్


గ్రామ సభలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీందర్ రెడ్డి


జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో కాలుష్యరహిత ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటు నిర్ణయం రైతులకు కునుకు లేకుండా చేస్తోంది. గుమ్మడిదలలో సర్వే నంబర్ 109లో 157.29 ఎకరాలలో ఈ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. భూసేకరణ విషయమై అధికారులు దూకుడు పెంచారు. ఇటీవల గ్రామ సభను ఏర్పాటు చేశారు. టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ రతన్ రాథోడ్, ఆర్డీవో రవీందర్ రెడ్డి భూసేకరణపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. అయితే.. భూములు తీసుకుంటున్న అధికారులు.. భూమికి బదులు భూమి ఇస్తారా..? లేక ఇంకేమైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపుతారా? అనేది ప్రకటించలేదు. దీంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. ''మా తాతల కాలం నుంచి భూములను నమ్ముకొని బతుకుతున్నాం. ఇప్పుడు ఇండస్ట్రీయల్ పార్కు పేరిట మా భూములను లాక్కొనేందుకు ప్రయత్నిస్తున్నారు. భూములు లాక్కుంటే మేం ఎట్లా బతకాలి. భూమికి భూమి ఇవ్వాలి. లేదా అన్నారం పరిధిలోని సర్వే నంబర్ 261లో వెయ్యి గజాలు చొప్పున పట్టాలు చేసి ఇవ్వాలి''అని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇన్నేళ్లుగా బతుకుదెరువునిచ్చిన భూములను అప్పగించేందుకు మాత్రం వారు వెనుకడుగు వేస్తున్నారు.

భూమికి భూమి ఇవ్వాలి



ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం రైతులకు భూమికి భూమి ఇచ్చి న్యాయం చేయాలి. ఎన్నో ఏళ్లగా ఈ భూముల్లో ఉపాధి పొందుతున్నాం. ఇప్పుడు పారిశ్రామిక వాడ ఏర్పాటు పేరిట రైతుల భూములు సేకరిస్తున్న ప్రభుత్వం .. బాధిత రైతులకు న్యాయం చేయాలి.
రవీందర్, రైతు, గుమ్మడిదల

వ్యవసాయ భూములు లాక్కోవద్దు



ఎన్నో ఏళ్లగా మేమంతా భూములు సాగు చేసుకుంటూ బతుకుతున్నాం. ఇప్పుడు ప్రభుత్వం పార్కు పేరిట మా భూములు కావాలంటుంది. ముందుగా మాకు ఏం న్యాయం చేస్తారో చెప్పాలి. వేరేచోట భూములు ఇచ్చినా సరే.. లేదంటే రోడ్డున పడతాం.
భద్రయ్య, రైతు, గుమ్మడిదల

బాధిత రైతులకు న్యాయం చేస్తాం: ఆర్డీఓ

గుమ్మడిదల మున్సిపాలిటీలో గ్రీన్, ఆరెంజ్ జోన్లో ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని ఆర్డీవో రవీందర్ రెడ్డి అన్నారు. ఈ ప్రాంతంలో పార్కు ఏర్పడితే కాలుష్య రహిత పరిశ్రమలను స్థాపిస్తామని, తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో అభివృద్ధికి కేంద్రబిందువుగా ఉంటుందన్నారు. భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా న్యాయం చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.